బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 6: అభివృద్ధి పేరుతో ప్రభుత్వం పేదల ఆస్తులను ధ్వంసం చేస్తున్నదని, ప్రభుత్వం వెంటనే హైడ్రా, మూసీ బాధితులకు ప్రత్యామ్నాయం చూపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లోని ఆయన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామ పంచాయతీల్లో నిధులు లేక చెరువుల వద్ద ఏర్పాట్లు చేయలేకపోతున్నరన్నారు. ఆయన వెంట చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నేతలు ఉన్నారు.

'మల్లన్న'ను దర్శించుకున్న భక్తులు

మల్లన్న ను దర్శించుకుంటున్న భక్తులు

పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, అక్టోబర్ 6 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులు నిండిపోయింది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. విద్యా సంస్థలకు సెలవులు రావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 5 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో ఏ బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో, భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు, కోడెల స్థంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మల్లన్న ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులకు సేవలు అందించారు.

విద్యార్థుల 'అపూర్వ' సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

అక్కన్నపేట, అక్టోబర్ 6 : మండలంలోని కట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2003-2004 'పది' బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, ప్రభావతి, మాధవిలత, మంజుల, అనిల్ కుమార్, కుమారస్వామి, పూర్వ విద్యార్థులు బొల్లి శ్రీనివాస్, వొద్దిమల్ల కిరణ్, గుగులోతు ఉపేందర్, ఖాదర్ పాషా, గుగులోతు సంపత్, హన్మండ్ల రాజేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, అక్టోబర్ 6 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తున్నదని, వెంటనే హామీలను ప్రభుత్వం అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన శిగుళ్ల మల్లేశం రూ.50వేలు, కే వినోదకు రూ. 34,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజాం, రామగౌడ్, బాలయ్య, సత్యగౌడ్, ఆగయ్య పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికి తీసేందుకు శిక్షణ

శిక్షణ అందించిన శిక్షకులను సన్మానిస్తున్న విశ్వకర్మలు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 6 : నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పీఎం విశ్వకర్మ శిక్షణ నిరుద్యోగ యువతకు వరం లాంటిదని శిక్షకులు అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ వడ్రంగి శిక్షణ సిద్దిపేట శ్రీనివాస నగర్‌లో ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విశ్వబ్రహ్మణులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు శిక్షణ భవిష్యత్‌లో చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచారి, బాల్‌చారి, సురేశ్ కుమార్, వెంకటేశం, సీతారాములు, పెద్ద సంఖ్యలో విశ్వకర్మ పాల్గొన్నారు.

అర్చనలు..అలంకరణలు

కొండపాక(కుకునూరుపల్లి) : లలిత త్రిపురసుందరీదేవిగా కొలువుదీరిన మర్కడగ విజయ దుర్గామాత

మద్దూరులో దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

సిద్దిపేట ఓం శ్రీ అసోసియేషన్ వారు నెలకొల్పిన అమ్మ వారి వద్ద కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

వర్గల్ : శ్రీ గౌరీదేవి రూపంలో కొలువుదీరిన వర్గల్ సరస్వతీమాత

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు లలిత త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులు సమర్పించారు. కుంకుమార్చలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

- సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 6

గజ్వేల్‌లో దుర్గామాతను దర్శించుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మిరుదొడ్డిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి

కొమురవెల్లి : గురువన్నపేటలో లలిత త్రిపుర సుందరీగా దర్శనమిచ్చిన అమ్మవారివద్ద పూజలు చేస్తున్న భక్తులు

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలోని జ్యోతినగర్ దుర్గాదేవి సన్నిధిలో భక్తుల పూజలు

సిద్దిపేట టౌన్: దుర్గా మాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గజ్వేల్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిబిరం

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గజ్వేల్, అక్టోబర్ 6 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరం ఆదివారం ముగిసింది. 33వ తెలంగాణ బెటాలియన్ సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన 640 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి ఫైరింగ్, కవాతు, మ్యాప్ రీడింగ్ తదితర సైనిక సంబంధాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, కెప్టెన్ భవానీ అతిథులుగా పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ శ్రేయల్, పీంఎంఎస్‌రావు, రామ్‌హరి, మహేందర్‌రెడ్డి, వెంకటేశం, సత్య ఆర్మీలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు ఉచిత కేంద్రాలు

గజ్వేల్, అక్టోబర్ 6 : వచ్చే మార్చిలో జరగబోయే కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారి కోసం ఉచిత ఓటు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రసన్న హరికృష్ణ బృందం సభ్యులు మల్లికార్జున్, సాధక్‌పాషా, మధుబాబు తెలిపారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో అయ్యప్ప దేవాలయం ఎదురుగా ఉన్న విద్యార్థి బుక్‌డిపో, సంగాపూర్ రోడ్డులోని గ్లోబల్ కంప్యూటర్ సెంటర్, పెంటాచారి దవాఖాన దగ్గర్లోని వేంకటేశ్వర కమ్యూనికేషన్ కేంద్రాల్లో ఉచితంగా ఓటుహక్కును నమోదు చేయనున్నరన్నారు. 2021లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని వచ్చే నెల 6వ తేదీలోపు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

చేపలు పంపిణీ చేయాలంటూ వినతి

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 6 : మత్స్యకారుల జీవనాధారమైన చేపలను ప్రభుత్వం తక్షణమే పంపిణీ చేయాలని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పెండ్యాల అయిలయ్య ఆధ్వర్యంలో పలువురు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. చెరువులు, కుంటలు నిండినప్పటికీ చేపలను పంపిణీ చేయకపోవడంతో జీవనాధారం దెబ్బతింటుందని వారు మంత్రికి ఆవేదన వినిపించారు. జిల్లాలో 372 సొసైటీలు ఉండగా టెండర్లు పిలిచామని ప్రభుత్వం చెబుతున్నదని కానీ కేటాయించిన నాలుగు కోట్లరూపాయలను సొసైటీలకు ఇవ్వాలని కోరినట్లు అయిలయ్య తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారి లో మత్స్యకార సంఘం నాయకులు చొప్పరి శ్రీనివాస్, పొన్నబోయిన శ్రీనివాస్, కాశబోయిన యాదగిరి, గంగాధర్ రాజ య్య, భిక్షపతి, బాలయ్య, మల్లయ్య, సంపత్‌తో పాటు హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

చేర్యాలలో ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

చేర్యాల, అక్టోబర్ 6 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చావడి వద్ద దేవి స్నేహ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారి మండపం వద్ద ఆదివారం నిర్వాహకులు బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మహిళలు, విద్యార్థులు హాజరై ముగ్గులు వేశారు. అనంతరం అమ్మవారి వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 6 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. కాలనీలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తారని ఎవరూ ఆందోళన చెందోద్దని సూచించారు.

కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

బతుకమ్మ సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్



బతుకమ్మ సంబురాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట,అక్టోబర్ 6 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు బతుకమ్మ అద్దం పడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని 33వ వార్డులో దాసాంజనేయ ఆర్యవైశ్య ఫ్యామిలీ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. నాయకులు అయిత రత్నకర్, సూర్య ప్రకాశ్, వెంకటేశ్, శ్రీకాంత్, మెయిజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(కుకునూరుపల్లి) : కుకునూరుపల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బహుజన బతుకమ్మ గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

గజ్వేల్, అక్టోబర్ 6 : మండల పరిధిలోని అక్కారంలో ఈనెల 9న నిర్వహించే బహుజన బతుకమ్మ గోడపత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. అరుణోదయ సాంస్కృతి సమాక్య ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో విమలక్క తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పూలతో బతుకమ్మలు చేసి 9న కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆవిష్కరణలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రం, ఎల్లయ్య, సత్తయ్య, కటుకం రాజయ్య, యాదగిరి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

స్వయం సేవకులకు కవాతు

చేర్యాలలో కవాతు నిర్వహిస్తున్న స్వయం సేవకులు

చేర్యాల, అక్టోబర్ 6 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వందేండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా పట్టణంలో ఆదివారం స్వయం సేవకులు భారీ కవాతు నిర్వహించారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి శ్రీ ఆది శంకర దేవాలయం వరకు కవాతు కొనసాగింది. అనంతరం దేశపతి అమోగ్, గోల్కొండ రాఘవులు స్వయం సేవకులకు దిశనిర్దేశం చేశారు. ఖండ కార్యవహా బోడుగం సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కురుమలకు ప్రతిభా పురస్కారాలు

మద్దూరు(ధూళిమిట్ట)/సిద్దిపేట టౌన్, అక్టోబర్ 6 : నేడు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కురుమ విద్యార్థులకు ప్రతిభా పురస్కార, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొలుపుల రాములు, ప్రధాన కార్యదర్శి స్వామి ఆదివారం తెలిపారు. పదో తరగతిలో 10 జీపీఏ, ఇంటర్‌లో 950 పైన, ఎంసెట్‌లో 10వేల లోపు ర్యాంకు, జేఈఈలో సీటు సాధించిన వారికి, నూతనంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారు, వివిధ పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 990813466 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రూట్‌మార్చ్

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 6: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రూట్‌మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. స్వయం సేవకుల రూట్‌మార్చ్ స్థానిక సర్వసతీ శిశుమందిర్‌నుంచి మల్లెచెట్టు చౌరస్తా మీదుగా గాంధీ చౌరస్తా, కృష్ణాటాకీస్, అక్కన్నపేటరోడ్ నుంచి తిరిగి శిశుమందిర్‌కు చేరుకుంటుందని దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ హెడ్ మాస్టర్ గంధే చంద్రమౌళితోపాటు పలువురు పాల్గొంటారని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

సిద్దిపేట, అక్టోబర్ 6 : మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా సభ్యుల రక్తదానం చేయడం సంతోషంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షుడు గందె శివకుమార్ అన్నారు. ఆదివారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలోని స్వచ్ఛంద రక్తనిధిలో 25 మంది సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కనకచంద్రం, అంజయ్య, ఇమ్రన్, రమేశ్,నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

గజ్వేల్, అక్టోబర్ 6: గజ్వేల్‌లోని సంగాపూర్ మార్గంలో ఉన్న సన్‌రైజ్ దవాఖానలో నేటి నుంచి ఉచిత ఫిజియోథెరఫీ నిర్వహించనున్నారు. సేవా పక్వాడలో భాగంగా సోమవారం నుంచి 19తేదీ వరకు మధ్యాహ్నం ఒకటి వరకు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార శ్రీలింగం, శ్రీధర్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నరేశ్ బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న క్రీడాజ్యోతి జిల్లాకు రాక

సిద్దిపేట, అక్టోబర్ 6 : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నవంబర్‌లో నిర్వహించే సీఎంకప్ క్రీడల కోసం రాష్ట్ర వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 8న సిద్దిపేట జిల్లాకు ర్యాలీ చేరుకుంటుదని జిల్లా క్రీడల యువజన విభాగం అధికారి కె. వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. 8న చిన్నకోడూరు మండలం రామంచలో క్రీడాజ్యోతిని సిద్దినేట క్రీడాకారులు అందుకోనున్నారు. 9న సిద్దిపేట స్టేడియం నుంచి పాత బస్టాండ్ మీదుగా కరీంనగర్‌కు క్రీడార్యాలీ నిర్వహించనున్నారు. తోటపల్లి వద్ద క్రీడాజ్యోతిని కరీంగర్ క్రీడాకారులకు అందించనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బెజ్జంకి, అక్టోంబర్ 6 : శ్రీలక్ష్మీనరసింహ డెకరేషన్ యూనియన్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా బొమ్మిడి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి నగేశ్, కోశాధికారిగా బొమ్మిడి నవీన్, గౌరవ అధ్యక్షుడిగా అలిపి రెడ్డి శంకర్, ఉపాధ్యాక్షుడిగా బొమ్మిడి గోపి, ప్రచార కార్యదర్శిగా బొమ్మిడి సాయికృష్ణలను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు.

మండల పరిషత్ ఉద్యోగి మృతి

అక్కన్నపేట, అక్టోబర్ 6 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ధూళిమిట్ట మండలం లింగాపురానికి చెందిన వెంకటేశ్ మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు అక్కడికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, సంజీవ్, అశోక్, తిరుపతి, ప్రభాకర్, శ్రీకాంత్, కార్తీక్, అనూష, సుచరిత తదితరులు ఉన్నారు.

పరామర్శ

కొమురవెల్లి, అక్టోబర్ 6 : మండలంలోని గురువన్నపేటలో బాధిత బాలిక కుటుంబాన్ని ఆదివారం జాతీయ మాల మాహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, మలమహానాడు నాయకులతో కలిసి పరామర్శించారు. కొమురవెల్లి మండలాధ్యక్షుడు తలారి కిషన్, మందాల బాబు,సతీశ్ కుమార్, రమేశ్, కిష్టయ్య, నర్సింహులు ఉన్నారు.

లారీని ఢీ కొట్టిన కారు

ముగ్గురికి గాయాలు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 6 : ముందుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేసి ఎడమ వైపు వెళ్తుండగా వెనకాల వస్తున్న కారు అదుపుతప్పి లారీ వెనక భాగంలో ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన కొండపాక గేట్ సమీపంలో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం వండ్లురు గ్రామానికి చెందిన శేఖర్ దుబాయ్ నుంచి స్వగ్రామానికి రావడానికి శంషాబాద్ విమానాశ్రయంలో దిగాడు. శేఖర్ తన స్నేహితులు అజయ్, సతీశ్ కలిసి కారులో వండ్లురు వస్తున్న క్రమంలో కొండపాక గేట్ వద్ద ముందు వెళ్తున్న లారీ ఒక్క సారిగా సడెన్ బ్రేక్ వేసి ఎడమవైపునకు వెళ్తున్న క్రమంలో లారీ వెనుకల వస్తున్న కారు అదుపు తప్పింది. దీంతో లారీ వెనకభాగంలో ఢీకొట్టడంతో కారులో పల ఉన్న బెలూన్స్ ఓపెన్ కావడంతో ముగ్గురు స్వల్పగాయాలపై బయట పడగా, కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు.

నుజ్జు నుజ్జయిన కారు